క్లుప్తంగా

క్రికెట్ విజేత కోటపల్లి జట్టు



గెలుపొందిన కోటపల్లి జట్టు

కోటపల్లి: మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం క్యాతనపల్లి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు మండలాల క్రికెట్ టోర్నమెంట్‌లో కోటపల్లి జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌కు కోటపల్లి, క్యాతనపల్లి జట్టు చేరుకోగా ఆతిథ్య జట్టును కోటపల్లి జట్టు చిత్తుగా చేసి విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన కోటపల్లి జట్టుకు రూ.20వేల నగదు, ద్వితీయస్థానంలో నిలిచిన క్యాతనపల్లి జట్టుకు రూ.10వేల నగదును వేమనపల్లి మండల మాజీ జెడ్పీటీసీ రుద్రభట్ల సంతోశ్, స్థానిక నాయకుల చేతులమీదుగా అందుకున్నారు.

కలెక్టరేట్ ఏవోకు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు ఉపసంహరించుకోవాలని, బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు అమలు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ కార్యాలయ ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం ఇచ్చారు. బీసీలకు న్యాయమైన ప్రజాస్వామ్య వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కారదర్శి అక్కల రమేశ్, నాయకులు భీమ్‌సేన్, రామగిరి రాజన్న, అంకం సతీష్ పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవం



సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి గ్రామ పంచాయతీలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం కొనసాగింది. వేద పండితులు గోవర్ధనగిరి అనంతాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ అభయాంజనేయ స్వామి, నవగ్రహ సహిత, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా చేశారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వివేక్

భీమారం: మండలంలోని సుంకరిపల్లి గ్రామానికి చెందిన సెగ్యం లక్ష్మి వైద్యం కోసం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి రూ.1.75లక్షలను బుధవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న భక్తుల రద్దీ



కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీక మాసం ప్రారంభం నుంచి నిత్యం భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. భక్తులు బుధవారం అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. ఆలయ పరిసరాల్లో కార్తీక దీపాలు వెలిగించి దీపారాధన చేశారు. ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా మారాయి.

ఉచిత షుగర్ పరీక్షలు

దండేపల్లి: మండలంలోని మేదరిపేటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మార్నింగ్ వాకర్స్‌కి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్, లయన్ రమేశ్, ల్యాబ్ మల్లేశ్, మార్నింగ్ వాకర్స్ రాజన్న, సత్యనారాయణ, రమేశ్, బుచ్చన్న, గోపాల్, శ్రీనివాస్ లక్ష్మణ్, చందు, సంతోశ్ పాల్గొన్నారు.

మంచిర్యాలలో క్రిటికల్ కేర్

- అందనున్న అత్యవసర వైద్య సేవలు
- ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా కొనసాగింపు
- నూతన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలోనే నిర్మాణం



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేసి మూడేళ్లు కావస్తుండగా, ఇటీవలే మూడో బ్యాచ్‌లో ఎంబీబీఎస్ విద్యార్థులు చేరారు. మూడేళ్లుగా క్రిటికల్ కేర్‌ను ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు ఉన్నా, నేటికీ నెరవేరలేదు. గతేడాది ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద మంచిర్యాల జిల్లాకు క్రిటికల్ కేర్‌ను మంజూరు చేసినా, అందుకు తగినట్లు పనులు జరగలేదు. మంచిర్యాల నియోజకవర్గంలో విద్య, వైద్యానికి స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అధిక ప్రాధాన్యం ఇస్తుండగా, మంచిర్యాల ఐబీ ఆవరణలో రూ.300కోట్లతో మాతా శిశు ఆరోగ్య కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి మంచిర్యాలకే వైద్య సేవల కోసం పెద్ద ఎత్తున ప్రజలు వస్తుంటారు. దీంతో ఇక్కడి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతుంటాయి. ఏళ్లుగా ఈ ప్రాంతంలో క్రిటికల్ కేర్‌ను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉన్నా, అది కలగానే మిగిలి ఉంది. గతేడాది మంజూరు చేసిన క్రిటికల్ కేర్‌పై పనులు ముందుకు కదలకపోవడంతో, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని క్రిటికల్ కేర్ ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు చేయించి, టెండరు ప్రక్రియను పూర్తి చేయించారు. రూ.27కోట్లతో ఏర్పాటు కానున్న క్రిటికల్ కేర్‌ను మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అనుబంధంగా కొనసాగించనున్నారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నూతన భవనాన్ని కాలేజీరోడ్డులోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆవరణలో నిర్మిస్తుండగా, అక్కడే క్రిటికల్ కేర్ నిర్మాణం కోసం టెండర్లను పూర్తి చేసి, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అత్యవసరం అయితే రెఫరే...!

మంచిర్యాల జిల్లా కేంద్రానికి కుమురంభీం ఆసిఫాబాద్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వస్తుంటారు. ప్రమాదాలబారిన పడిన వారు మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరుతుండగా రోగుల తాకిడి ఎక్కువవుతోంది. ప్రస్తుతం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కేవలం 5 బెడ్‌లతో కూడిన ఐసీయూ మాత్రమే ఉండడం, కొన్నింటికి మాత్రమే వైద్యం అందిస్తుండడంతో, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు వారిని రెఫర్ చేస్తున్నారు. దూర ప్రాంతాలకు ఆయా వ్యక్తులను తరలించేలోపు కొందరు మృత్యువాత పడుతున్న సంఘటనలు చోటు చేసుకోవడంతో, వారి కుటుంబాల్లో విషాదం నెలకొంటుంది. విషం, పురుగుల మందు తాగిన వారికి కొంత వరకు చికిత్స అందిస్తున్నా, వీరిలోనూ క్రిటికల్‌గా ఉన్న వారిని ఇతర ఆసుపత్రులకు తరలిస్తున్నారు. గుండెపోటు వచ్చిన వారిని నేరుగా కరీంనగర్‌కే తరలించాల్సి వస్తోంది. ఇక రాత్రి సమయాల్లో జరిగే రోడ్డు ప్రమాదాలు గాని, అత్యవసర వైద్యం గాని మంచిర్యాలలో అందడం లేదు.

క్రిటికల్ కేర్‌తో మెరుగైన వైద్యం

క్రిటికల్ కేర్‌ను ఏర్పాటు చేయడం వల్ల అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. దీనికోసం దాదాపుగా రూ.27కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించగా, క్రిటికల్ కేర్ నిర్మాణం, 50పడకల ఐసీయూతో పాటు, ఆక్సిజన్, వెంటలేటర్లు, అన్ని విభాగాల్లో నిష్ణాతులైన వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. పేద ప్రజలకు అత్యాధునిక వైద్యం అత్యవసర సమయాల్లో ఇక్కడే అందుబాటులోకి వస్తుంది. క్రిటిక్ కేర్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేసి, త్వరగా అందుబాటులోకి తీసుకొస్తే, పేద ప్రజలతో పాటు, ఈ ప్రాంత ప్రజలకు మేలు జరగనుంది.

త్వరలో పనులు ప్రారంభిస్తాం



మంచిర్యాలలో క్రిటికల్ కేర్ ఏర్పాటు కోసం రూ.27కోట్ల నిధులు మంజూరు చేయించి, టెండరు ప్రక్రియను పూర్తి చేశాం. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అనుబంధంగా క్రిటికల్ కేర్‌ను ఏర్పాటు చేయడం వల్ల, అత్యవసర సమయాల్లో పూర్తిస్థాయి వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుంది. ఇతర ప్రాంతాలకు రెఫర్ చేసే కేసులకు ఇక్కడే వైద్యం అందించడం వల్ల ప్రాణాలు పోకుండా ఆపేందుకు అవకాశం. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన, నాణ్యతతో కూడిన ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం.

– ప్రేమ్‌సాగర్‌రావు, మంచిర్యాల ఎమ్మెల్యే

బెల్లంపల్లి నుంచే ఉద్యమం ప్రారంభిస్తాం



మహిళను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

బెల్లంపల్లి: అబద్ధపు ప్రచారాలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్‌ఎస్ పార్టీ బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విమర్శించారు. మున్సిపాలిటీలోని రెండో వార్డు కాంట్రాక్టర్ బస్తీకి చెందిన పలువురు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం ఆయన మాట్లాడారు. హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వంపై బెల్లంపల్లి నుంచే తిరుగుబాటు జరుగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్థానికంగా నివాసం ఉంటానని ఎన్నికల ప్రచారంలో బాండ్ పేపర్ రాసిచ్చి, ఏ ఒక్కరోజు కూడా క్యాంపు కార్యాలయంలో నివాసం ఉండటం లేదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా, సమస్యలు తీర్చకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మాజీ ఎంపీపీ జి.శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ, టీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, శ్రేణులు ఎస్.అరుణ్, అలీ, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

తాండూర్: ధాన్యం కొగనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ... ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ధాన్యం నిల్వలకు సరిపడా గన్నీ సంచులు ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. ధాన్యాన్ని నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, వ్యవసాయ సహకార సంఘం సీఈవో శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలది ఒకే కులం'



మాట్లాడుతున్న నరసింహచారి

చెన్నూర్: తెలంగాణ వ్యాప్తంగా బీసీ కమీషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుల గణనలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను ఒకే కులంగా పరిగణించాలని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఏలేశ్వరం నరసింహచారి అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ గణన బుక్ ఫార్మెట్‌లో కుల వృత్తుల ఆధారంగా కోడ్‌ను కేటాయించినట్లు తెలిపారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతిని బీసీ ప్రణాళిక సంఘం వంచనకు గురిచేస్తోందన్నారు. ఈ విషయంపై విశ్వబ్రాహ్మణ సమాజం తీవ్రంగా అభ్యంతరం తెలుపుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు బీసీ కులాల జాబితాలో నంబర్ 21 ప్రకారం బీసీ (బీ)గా విశ్వబ్రాహ్మణ కులం పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు ఒకే కులంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కులగణనలో సవరణ చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో స్వర్ణకార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి సందీప్‌చారి, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ప్రజల రక్షణ పోలీసుల బాధ్యత



ఏసీపీకి స్వాగతం పలుకుతున్న ఎస్సై

భీమిని: ప్రజల రక్షణ పోలీసుల బాధ్యత అని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. భీమిని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో దొంగతనాలు, గొడవలు జరగకుండా పెట్రోలింగ్ చేపట్టాలని సూచించారు. సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఎస్సై విజయ్‌కుమార్, ఏఎస్సై తిరుపతి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మెరుగైన క్యాడర్ స్కీంను అమలు చేస్తాం

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్అండ్‌పీసీ సిబ్బందికి మెరుగైన క్యాడర్ స్కీంను అమలు చేస్తామని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. శ్రీరాంపూర్‌లోని సెక్యూరిటీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రమోషన్ పాలసీ కోసం, ప్లేడేలు కల్పించడం కోసం యాజమాన్యంపై ఒత్తిడి తెస్తామన్నారు. చెక్ పోస్టుల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సెక్యూరిటీ సిబ్బందికి క్వార్టర్ల కేటాయింపుల్లో వెయిటేజీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేని శ్యాం, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, నాయకులు భీంరావు, భీంరావు, వెంగల కుమారస్వామి, నీలం సదయ్య, రౌతు సత్యనారాయణ, తోట మల్లేశ్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కాసిపేట: మండలంలోని కేజీబీవీ విద్యార్థినులు ముగ్గురు నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేక అధికారి సరిత తెలిపారు. 9వ తరగతి విద్యార్థినులు హర్షిణి, హారిక, అక్షయ సింధ్ మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 8నుంచి 10వరకు నిర్మల్ జిల్లాలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థినులను, పీఈటీని ప్రత్యేక అధికారితో పాటు తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా కమిటీలో చోటు

చెన్నూర్: పట్టణానికి చెందిన నూక శ్రీనివాస్, చకినారపు హరీశ్‌లను ఆర్యవైశ్య సంఘం మంచిర్యాల జిల్లా కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. మంచిర్యాలలో జరిగిన జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో నూక శ్రీనివాస్, చకినారపు హరీశ్‌లకు జిల్లా కమిటీలో చోటు దక్కింది. సంఘం అభివృద్ధి కోసం వారు చేస్తున్న సేవలను గుర్తించి ఈ పదవులు ఇచ్చినట్లు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు.

9, 10తేదీల్లో ఓటరు నమోదు

వేమనపల్లి: ఈ నెల 9, 10తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ రమేశ్ తెలిపారు. బీఎల్‌వోలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. మార్పులు, చేర్పులుంటే సరి చేసుకునే అవకాశం ఉందన్నారు. బీఎల్‌వోలు పోలింగ్‌స్టేషన్‌ల వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు.

పామాయిల్ తోటల సందర్శన

వేమనపల్లి: పామాయిల్ మొక్కలకు సోకుతున్న కాండం తొలుచు పురుగుతో నష్టాలు ఎక్కువని బెల్లంపల్లి ఉద్యానవన శాఖ అధికారి అరుణ్‌కుమార్ అన్నారు. వేమనపల్లి మండలంలోని గొర్లపల్లి, వేమనపల్లి, రాజారాం గ్రామాల్లోని పామాయిల్ తోటలను బుధవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

బెల్లంపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి సీ.హెచ్ దుర్గాప్రసాద్, తహసీల్దార్ జోత్స్న, ఎంపీడీవో మహేందర్ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వే నిర్వహించే ఎన్యుమరేటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'అధైర్య పడొద్దు'

జన్నారం: కుటుంబ పెద్ద అనారోగ్యంతో మృతి చెందితే ఆ కుటుంబం ఎంతో దీనవస్థలో ఉంటుంది. మీరు అధైర్య పడకండి, నేను అండగా ఉంటానని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇంచార్జి భుక్య జాన్సన్ నాయక్ అన్నారు. మండలంలోని కలమడుగు తాండాకు చెందిన అనిల్, మొర్రిగూడ ఉపాధ్యాయుడు శంకర్ మృతి చెందగా బుధవారం వారి కుటుంబాలను పరామర్శించారు.

క్రైం కార్నర్..

పీడీఎస్ బియ్యం పట్టివేత

మంచిర్యాలక్రైం: మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం... జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన టీ.సుదర్శన్ ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా గుర్తించినట్లు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జైపూర్: పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామం నుంచి బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 20క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇందారం వద్ద పట్టుకున్నారు. పెద్దంపేట నుంచి బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారన్న సమాచారంతో సీఐ ఎం.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బొలేరో వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు. పెద్దంపేట గ్రామానికి చెందిన పాస్తాము రాంచందర్ పరారీలో ఉండగా, రేవెల్లి ప్రశాంత్ పట్టుబడ్డాడు. 20క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో పాటు, రెండు సెల్‌ఫోన్లు, బొలేరో వాహనాన్ని జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ముగ్గురి బైండోవర్

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూపులో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టిన ముగ్గురు వ్యక్తులను బుధవారం తహసీల్దార్ రాజమనోహర్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. కిష్టాపూర్‌కు చెందిన వాసాల నరేశ్, గట్టు మహేశ్, ఒడ్డెపెల్లి రాజేశ్‌లు ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకుంటూ వాయిస్ మెసేజ్‌లు పెట్టి గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించినందుకు బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై సుగుణాకర్ బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలంలోని సుందరయ్య కాలనీలోని చింతల నరేశ్ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఆకస్మిక తనిఖీ చేపట్టాం. నరేశ్‌తో పాటు మంచిర్యాలకు చెందిన సిరిగిరి దశరథ్, మౌటం జనార్దన్, సరిగిరి రమేశ్, మౌటం రాజు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ. 2500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

'యువతను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది'



మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

మంచిర్యాలటౌన్: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం యువతను వంచిస్తూ మోసం చేస్తోందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్ రెడ్డి అధ్యక్షతన జిల్లాస్థాయి ముఖ్య నాయకుల సమావేశం బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సంతోశ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో తెలంగాణ సమాజాన్ని మోసం చేసిన విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. హైడ్రా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు, పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు తరుణ్ సింగ్, చిరంజీవి, విష్ణు, మండల అధ్యక్షులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

ప్రమాదకరంగా చెట్ల కొమ్మలు



ఎర్రగుంటపల్లి సమీపంలో రోడ్డుకు అడ్డంగా పెరిగిన తుమ్మ చెట్లు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర, ఎర్రగుంటపల్లి, చాకెపల్లి, పొక్కూరు, ముత్తరావుపల్లి, ఉచ్చపల్లి, బీరెల్లి గ్రామాలకు వెళ్లేందుకు సింగిల్‌రోడ్డు సౌకర్యం ఉంది. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, తుమ్మ చెట్లు మొలిచి రోడ్లపైకి కమ్ముకొని వచ్చి ప్రమాదకరంగా మారాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకుండా ఉన్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: భరత్, ఆర్అండ్‌బీ ఏఈ ఫోన్ నంబర్ : 79891 89570

సంక్షిప్త వార్తలు

'కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయండి'

బెల్లంపల్లి: లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను వెంటనే అందజేయాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెక్కులు సిద్ధమై పక్షం రోజులు గడుస్తున్నా, రెవెన్యూ అధికారులు పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే సమావేశం పెట్టి అందజేస్తారని సమాధానం చెబుతున్నారని పేర్కొన్నారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

భీమిని: కేజీబీవీ, గురుకుల పాఠశాలల విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచడంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యార్థులతో కలిసి క్షీరాభిషేకం చేశారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాసమల్ల శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిహారం అందజేత

కాసిపేట: మండలంలోని దేవాపూర్ రేంజ్ పరిధిలో చిరుతపులి దాడిలో మంగళవారం గురువాపూర్‌కు చెందిన ఆడె గోపి ఆవు మృతి చెందింది. బుధవారం అటవీశాఖ మంజూరు చేసిన నష్టపరిహారం రూ.8వేల చెక్కును రేంజ్ అధికారి అనిత యజమాని ఆడె గోపికి అందజేశారు.

కంటి ఆసుపత్రి సందర్శన

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి ఆసుపత్రిని బుధవారం లయన్స్‌క్లబ్‌కు చెందిన ఆరు గురు గవర్నర్లు సందర్శించారు. ఆసుపత్రి నిర్వహణ తీరు పరిశీలించారు. ఉత్తమ సేవలు అందిస్తుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆసుపత్రి ట్రస్ట్ సభ్యులు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు.

సర్వేలో కార్యదర్శులదే కీలక పాత్ర

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో పంచాయతీ కార్యదర్శులే కీలక పాత్ర పోషిస్తున్నారని పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం అసోసియేట్ అధ్యక్షుడు బొడ్డు శ్రావణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్యుమరేటర్ పాత్ర పోషిస్తూనే ఎన్యుమరేటర్లకు గ్రామ పరిస్థితులపై సమగ్ర సమాచారం అందిస్తూ కార్యదర్శులు నిబద్ధతగా పని చేయాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల : 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
చెన్నూర్ : సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899